ప్రజాశక్తి
ఆదివారం 26 నవంబరు 2023
5

నేడు డయల్ యువర్ ఆర్‌టిసి ఆర్ఎం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రయాణికుల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు నిర్వహిస్తున్న డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా రవాణా అధికారి విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎపిఎస్ ఆర్‌టిసి ద్వారా అందుతున్న సేవల్లో అసౌకర్యాలున్నా, సకాలంలో బస్‌లు అందుబాటులో లేకున్నా, ఇతర సౌకర్యాల్లో ఎదురయ్యే సమస్యలతో పాటు ప్రయాణికుల సూచనలు, సలహాలు తెలియజేయాలని సూచించారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో నేరుగా ఫోన్ నంబరు 9959225603ను సంప్రదించాలని సూచించారు.

అసంపూర్తిగా నిలిచిన ఆమదాలవలస మండలం గాజులకొల్లివలస సచివాలయం

సవాల్‌గా మారిన ప్రాధాన్యతా భవనాలు

ప్రభుత్వం మంజూరు చేసిన పాధాన్యతా భవనాలు పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్లకు సవాల్‌గా మారాయి. మంజూరు చేసి ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కావడం లేదు. నిబంధనలను కాదని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టం నిధులతో భవన నిర్మాణాలకు మంజూరు చేశారు. పెరిగిన ధరల ప్రభావం ఈ భవనాలపై పడింది. సకాలంలో చెల్లింపులు చేపట్టకపోవడంతో అనేక నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈ పనులు పూర్తి చేయకపోతే సస్పెండ్ చేస్తామంటూ ఉన్నత స్థాయిలో ఇంజనీరింగ్ అధికాకులపై ఒత్తిడి తెస్తున్నారు. వాస్తవానికి భిన్నంగా వీటి నిర్మాణం పూర్తి సాధ్యం కాదని ఇంజనీర్లు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే ఈ భవన నిర్మాణాల్లో వెనుక బడ్డారన్న కారణంతో ముగ్గురు ఎఇలకు సస్పెన్షన్, ఇఇకి సరెండర్, ఎస్ఇకి షోకాజ్ నోటీసులకు సిఫార్సు చేశారు.

- ఒత్తిళ్ల నడుమ పంచాయతీరాజ్ ఇంజినీర్లు
- చెల్లింపుల్లేక అవస్థలు పడుతున్న కాంట్రాక్టర్లు
- 2019-20 నుంచి ముందుకు సాగని పనులు
- మంజూరైనవి 1839, రద్దయినవి 385
- పూర్తి చేసినవి 784, బకాయిలు రూ.8.35 కోట్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా 2019-20 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం గ్రామ సచివాయాలకు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ హెల్త్ సెంటర్లకు భవన నిర్మాణాలకు ఎన్‌ఆర్ఇజిఎస్ నిధులతో మంజూర్లు ఇచ్చారు. ఈ భవనాలను ప్రాధాన్యతగా ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో గ్రామ సచివాలయ భవనానికి రూ.40 లక్షలు, రైతు భరోసా కేంద్రాలకు రూ.21.8 లక్షలు, వెల్‌నెస్ సెంటర్లకు రూ.17.5 లక్షల అంచనాలతో మంజూర్లు ఇచ్చారు. జిల్లాలో ఉన్నతాధికారులు 1839 భవన నిర్మాణాలను అనుమతులు మంజూరు చేశారు. ఈ పనులు స్థానికంగా ఉన్న పాలక పక్షానికి చెందిన నాయకులు, చిన్న చిన్న కాంట్రాక్టర్లకు అప్పగించి పనులు మొదలు పెట్టారు. ఇసుక లభ్యత లేక, సకాలంలో చెల్లింపులు జరగకపోవడం, ఇతర కారణాల వల్ల మొదట్లోనే పనులు ప్రారంభించడం ఆలస్యమైంది. స్థల వివాదాలు, సాంకేతిక పరమైన ఇబ్బందుల వల్ల జిల్లాలో 385 భవన నిర్మాణాలు మొదలు కాలేదు. మిగిలిన 1454 భవనాలకు సంబంధిత వ్యక్తులు పనులు మొదలు పెట్టారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం వల్ల కొందరు మధ్యలో పనులు నిలుపుదల చేశారు. దీంతో రెండేళ్లు గడచింది. ఎన్‌ఆర్ఇజిఎస్ నిబంధనలకు లోబడి పనులు మంజూరైన తర్వాత ఏడాది లోపు వాటిని పూర్తి చేయాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం అనుమతిస్తే మరో ఏడాది పాటు ఆ పనులు పూర్తి చేసుకునేందుకు వీలుంటుంది. చెల్లింపులు మాత్రం పనులు మంజూరైన నాటి ధరలకే పూర్తి చేయాల్సి ఉంటుంది.

జిల్లాలో నిర్మాణంలోని 1454 భవనాలను 2019-20లో ప్రారంభించిన వారు 2020-21లోగా పూర్తి చేస్తే చెల్లింపులకు వీలుంటుంది. అయితే ఈ నిర్మాణాలు ప్రారంభం నాటికి ఇసుక టన్ను రూ.350 ఉంటే... ఇప్పుడు ఆ ధర రెండింతలైంది. ప్రస్తుతం గ్రామాల్లో రూ.700 నుంచి 800 వరకు ఇసుక అమ్ముతున్నారు. సిమెంట్ ధర పనులు మంజూరు నాటికి రూ.210 ఉంటే... ఇప్పుడు బస్తా ధర రూ.350 వరకు ఉంది. ఇనుము ధర టన్ను రూ.25 వేల నుంచి రూ.60 వేలకు పెరిగింది. దీంతో అరకొర పెట్టుబడులు పెట్టి పనులు చేసుకునే కార్యకర్తలు, చిరు కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయలేమని చేతులెత్తేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 784 భవనాలు మాత్రమే పూర్తి చేయగలిగారు. మరో ఆరు దాదాపు పూర్తి దశలో ఉండగా, 95 రూఫ్ లెవల్లో, అంతకంటే తక్కువగా 332, రెండో రూఫ్ దశలో 146, ప్లాస్టింగ్ దశలో 90 భవనాలు ఉన్నాయి. చెల్లింపుల పరిస్థితి చూస్తే జిల్లాలో రూ. 8.35 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మరో 790 బిల్లు అప్‌లోడ్ చేయడానికి సిద్ధంగా ఉంచారు. వీటి విలువ రూ.100 కోట్లు పైనే. పనులు పూర్తి చేయడానికి ఇంకా 670 భవనాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి.

అడ్డంకులు

పనులు గతంలో ప్రారంభించిన వారు వాటిని పూర్తి చేయడానికి వెనకడుగు వేస్తున్నారు. ఉపాధి పథకం నుంచి ఈ పనులకు కొత్తగా మంజూర్లు రాకపోవడం, ప్రభుత్వం నుంచి బకాయిలు పేరుకుపోవడం ప్రధాన అడ్డంకిగా మరింది. పెరిగిన ధరలకు అనుగుణంగా చెల్లింపులు జరపడానికి అంచనాలు పెంచుకునే అవకాశం ఉపాధి పనుల్లో లేకపోవడం కూడా అడ్డంకే. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. తీనికితోడు ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో పనులు పూర్తి చేస్తే... మిగిలిన డబ్బులు వస్తాయో? రావో? తెలియని పరిస్థితి ఉంది. గత ప్రభుత్వ హయాంలో అప్పటి టిడిపి కార్యకర్తలు నీరు-చెట్టు, ఉపాధి నిధులతో వేసిన రోడ్లకు రూ.వందల కోట్లు నిలిచిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం వాటిని చెల్లించకుండా నిలుపుదల చేసింది. న్యాయస్థానంలో పోరాడినా ఇంతవరకు వారికి చెల్లింపులు జరగలేదు. ఇప్పుడు పనులు చేస్తే అటువంటి పరిస్థితి ఎదురయ్యే ప్రమాదం ముందని భావించి పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. ఇటువంటి స్థితిలో ఈ పనుల ప్రాధాన్యత గుర్తించడం లేదంటూ పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్లపై ఒత్తిడి పెంచుతున్నారన్న భావన సర్వత్రా వ్యక్తమవుతోంది.

పెండింగ్ పనుల పూర్తికి చర్యలు

జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావాలి. చెల్లింపులకు ఎటువంటి అడ్డంకి లేకుండా ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకెళ్తున్నాం.

- వి.ఎస్.ఎన్ మూర్తి, సూపరింటెండెంట్, పంచాయతీరాజ్ శాఖ

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

సెక్టార్ అధికారులదే కీలకపాత్ర

జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులదే కీలక పాత్ర అని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ లాఠకర్ అన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారులకు మొదటి దశ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలకు నాలుగు నెలల ముందుగా సెక్టార్ అధికారులను నియమించి వారికి శిక్షణ ఇవ్వాలని ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేశారన్నారు. రిటర్నింగ్ అధికారులకు సెక్టార్ అధికారులు అనుసంధానమై ఉంటారని అన్నారు. ఒకొక్క రిటర్నింగ్ అధికారికి 20 నుంచి 30 సెక్టార్లు ఉంటాయని పేర్కొన్నారు. ఒకో సెక్టార్ అధికారికి 10 నుంచి 15 పోలింగ్ కేంద్రాల పరిధి ఉంటుందని చెప్పారు. సెక్టార్ అధికారులకు ఎన్నికల సమయంలో మెజిస్టీరియల్ అధికారాలు కల్పిస్తున్నట్లు వివరించారు. సెక్టార్ అధికారులు తమ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్నీ స్వయంగా సందర్శించి వసతులను, ఓటర్లకు అనుకూలతలను పరిశీలించాలని అన్నారు. సమస్యాత్మక అంశాలను నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే తమ పరిధిలో సోషల్, కమ్యూనిటీ, పొలిటికల్, లా అండ్ ఆర్డర్ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. బూత్ లెవల్ అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎస్‌హెచ్‌వోలను ఒకరికి ఒకరు పరిచయం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో రాజకీయ పక్షాలతో సమావేశాలు నిర్వహించి సమస్యలపై చర్చించాలన్నారు. ఎన్నికలకు ఎలక్టోరల్, ఇవిఎం, పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ సిబ్బంది కీలకమన్నారు. ప్రతి ఎన్నికలనూ కొత్తగానే చూడాలని, ఏ దశలోనూ తప్పిదాలకు ఆస్కారం ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియ, ఈవీఎంల నిర్వహణపై సెక్టార్ అధికారులకు అవగాహన కల్పించారు. శిక్షణకు 139 అధికారులకు 21 మంది గైర్హాజరయ్యారని, వారంతా ఈ నెల 28న జరిగే శిక్షణకు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. ప్రశాంత వాతావరణంలో జిల్లాలో ఎన్నికల నిర్వహణ జరగాలని, ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమ నిబంధనలకు లోబడి పనిచేయాలని అన్నారు. ఎన్నికల నిర్వహణకు మాస్టర్ ట్రైనీ జయదేవి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య ఎన్నికల నిర్వహణ అంశాలపై పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా అనుమానాలు నివృత్తి చేశారు. అనంతరం ఇవిఎంల ద్వారా ఓటింగ్ విధానాన్ని వివరించారు. శిక్షణా కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘువేంద్ర మీనా, శ్రీకాకుళం, నరసన్నపేట, ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాలకు ఎన్నికల విధుల కోసం నియమితులైన సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులు హాజరయ్యారు.

పలాసలో దొంగల బీభత్సం

11 దుకాణాల్లో రూ.1.20 లక్షల నగదు అపహరణ

పగులుకొట్టిన తాళాన్ని చూపిస్తున్న కూరగాయల వ్యాపారి

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని దొంగలు బీభత్సం సృష్టించారు. నిత్యం రద్దీగా ఉండే కాశీబుగ్గ పాత బస్టాండ్ ప్రాంతంలోని మహత్మగాంధీ షాపింగ్ కాంప్లెక్స్, ఐడిఎస్ఎంటి దుఖాణాల సముదాయంలో ఉన్న 11 దుఖాల్లో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత దొంగలు చోరీకి పాల్పడ్డారు. పలు దుఖాణాల్లో వ్యాపారులు ఉంచుకున్న నగదు రూ.1.20 లక్షలు వరకు దొంగించినట్లు వ్యాపారులు తెలిపారు. వ్యాపారులు దినచర్యలో భాగంగా శనివారం తమ దుకాణాలు తెరిచేందుకు వచ్చిన సమయంలో ఆయా దుకాణాల తాళాలు బద్దలుగొట్టి ఉండడంతో దొంగతనాలు జరిగినట్లు గుర్తించారు. కొన్ని దుకాణాల్లో వ్యాపారులు కౌంటర్లో ఉంచిన రూ.పది నుంచి రూ.20 వరకు వరకు చోరీకి గుర్తైనట్లు వ్యాపారులు తెలుసుకొని కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రద్దీగా ఉండే ప్రాంతంలో 11 దుకాణాల్లో ఒకేసారి చోరీకి పాల్పడడం సంచలనం కలిగించింది. రాత్రి సమయాల్లో గస్తీ తిరుగుతున్న పోలీసులకు ఏ మాత్రం అనుమానం కాకుండా దొంగతనాలు జరగడం వింతగొల్పుతోంది. పోలీసులు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారో? లేదో. ఈ సంఘటనతో రుజువు చేస్తుందని వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

వంట కార్మికులకు
కనీస వేతనం అమలు చేయాలి

మాట్లాడుతున్న మాట్లాడుతున్న మహాలక్ష్మి

ప్రజాశక్తి- రణస్థలం

మధ్యాహ్న భోజనం పథకంలో పనిచేస్తున్న వంట కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, మెనూ ఛార్జీలు పెంచాలని ఎపి మధ్యాహ్నం భోజన పథకం కార్మిక యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు అల్లు మహాలక్ష్మి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. యూనియన్ మండల కార్యదర్శి వి.లక్ష్మి అధ్యక్షతన స్థానిక హైస్కూల్ ఆవరణలో మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 20 ఏళ్లుగా పనిచేస్తున్న వంట కార్మికులకు కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ ఉద్యోగ భద్రత, పెన్షన్ వంటివి అమలు చేయాలన్నారు. ప్రపభుత్వాలు లక్ష్యానికి విరుద్ధంగా పథకాన్ని నీరుగార్చేందుకు నిరంతరం బడ్జెట్లో కోతలు పెడుతున్న పరిస్థితి ఉందన్నారు. వంట చేస్తున్న సమయంలో అగ్ని ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నా... ఎలాంటి వైద్య బీమా సౌకర్యం లేకపోవడం అన్యాయమన్నారు. అనేక స్కూళ్లలో ప్రథమ చికిత్స కూడా ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వంట షెడ్లు, వంట పాత్రలు, తాగునీరు, గ్యాస్ సరఫరా వంటి మౌలిక సదుపాయాలు ప్రభుత్వం కల్పించకపోవడం అన్యాయమన్నారు. జగనన్న గోరుముద్ద పేరుతో ఇస్తున్న మెనూ ఛార్జీలకు సంబంధం లేకుండా రోజుకో వంటతో ప్రభుత్వం మెనూ తయారు చేసి వర్కర్లపై భారాన్ని మోపుతుందన్నారు. రాగి జావా తయారీకి గ్యాస్ వంటపాత్ర ఎంతైనా అవసరమని, ప్రభుత్వం వీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. నూతన విద్యా విధానం అమలు వల్ల వంట కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని అన్నారు. ప్రతినెలా 5 లోగా వేతనాలు, బిల్లులు చెల్లించాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. డిమాండ్ల సాధనకు కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. అలాగే ఈ నెల 27,28 తేదీల్లో విజయవాడలో జరిగే కార్మిక, కర్షక ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల నాయకులు రాము, సుగుణ, జ్యోతి, లక్ష్మి, బుల్లమ్మ, ఈశ్వరమ్మ, సింహాచలం, రాములమ్మ, నారాయణమ్మ శాంతమ్మ, భవాని, ఎం.రామలక్ష్మి, కె.అన్నపూర్ణ పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిల పర్యటన

సన్మానిస్తున్న బార్ కౌన్సిల్ సభ్యులు, న్యాయవాదులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, జస్టిస్ జి.రామకష్ణప్రసాద్‌లు శనివారం జిల్లాలో పర్యటించారు. ముందుగా అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆయాన్ని దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, అర్చకులు స్వాగతించారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో వారికి ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్ స్వామివారి శేష వస్త్రాలను కప్పి చిత్రపటాలను అందజేశారు. వారి వెంట జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా పాల్గొన్నారు. అనంతరం సన్‌రైజ్ హోటల్‌కు చేరుకున్నారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మర్యాద పూర్వకంగా కలుకుని పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అలాగే బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావు, మూడో అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు, ప్రోటోకాల్ జడ్జి కందికట్ల రాణి, బార్ కౌన్సిల్ రాష్ట్ర మెంబర్ గేదెల వాసుదేవరావు, సీనియర్ న్యాయవాదులు తర్లాడ రాధాకృష్ణ, కె.అఫీసునాయుడు, కూన అన్నంనాయుడు, పి.వి.రమణ దయాల్, మామిడి క్రాంతి, జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పొన్నాడ రాములు కలిసి వారికి దుశ్శాలువ కప్పి సన్మానించారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రవికుమార్

విద్యా వ్యవస్థ నిర్వీర్యం

'విద్యార్థి మేలుకో-భవిష్యత్‌ను కాపాడుకో' పోస్టర్‌ను ఆవిష్కరించిన రవికుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో చదవురాని వారంతా మంత్రులు, ముఖ్యమంత్రిగా పాలన సాగిస్తున్నారని, చదువు విలువ తెలియక పోవడం వల్లే విద్యావ్యవస్థను సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి నిర్వీర్యం చేస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ధ్వజమెత్తారు. నగరంలో జిల్లా టిడిపి కార్యాలయంలో టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యాన 'విద్యార్థి మేలుకో-భవిష్యత్‌ను కాపాడుకో' అనే పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ పదో తరగతి తప్పారని, శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం దొడ్డి దారిన న్యాయ కళాశాల ధ్రువపత్రం పొందారని అన్నారు. మంత్రులు ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యన్నారాయణ ఎంత వరకు చదువుకున్నారో వారి ఆత్మసాక్షిరే తెలుసని అన్నారు. అటువంటి వారు పాలన సాగిస్తూ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. విద్యార్థులకు మేనమామగా ఉంటానని హామీలు ఇచ్చిన జగన్... కంసమామగా మారి విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారని విమర్శించారు. అస్తవ్యస్తమైన విద్యావ్యవస్థ వల్ల ప్రయివేటు, ప్రభుత్వ ఉద్యోగాలు రాకపోవడంతో యువత తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రాష్ట్రంలో ఉపాది లేక 120 మంది యువకులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. అధికారంలోకి వస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెచ్చి ఉద్యోగాల విప్లవం తెస్తానని మాయమాటలు చెప్పిన జగన్... కేంద్రం ముందు మోకరిల్లి యువత విద్యార్థుల జీవితాలను బలిపీఠం పైకి నెట్టారన్నారు. సంక్షేమ పథకాలు ఇస్తున్నామని నమ్మించి వాటికి రెట్టింపు దోచుకుంటున్నారని, ధరలను నియంత్రించడంలో పూర్తి వైఫల్యం చెందారని అన్నారు. యువత, విద్యార్థుల పాలిట శాపంగా మారిన జగన్‌పై డిసెంబరు 7న అన్ని పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేస్తామని చెప్పారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర నాయకులు వజ్జ బాబూరావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు గోర అనిల్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బలగ ప్రహర్ష, రెడ్డి శంకర్, యాల వరుణ్, శ్యామలరావు, సాధు అజయ్, ఎన్ని శ్రీకాంత్, అనిల్, కోల సింహాచలం, ధర్మేంద్ర పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- మందస

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా నవంబరు 27,28న విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తున్నామని, అందరూ పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, ఎన్.గణపతి పిలుపు నిచ్చారు. మందసలో సిఐటియు కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశానికి వ్యతిరేకమైన వినాశకర కార్పొరేట్ అనుకూల విధానాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దూకుడుగా అమలు చేస్తోందని అన్నారు. పెరుగుతున్న నిరుద్యోగం, ఉద్యోగాలు కోల్పోవడం, అధిక ధరల సమస్యలను కార్మికులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను లేబరు కోడ్ల రూపంలో కాలరాస్తోందని అన్నారు. 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచుతామని ప్రకటిస్తున్నాయని అన్నారు. కార్మికుల ప్రాణాలను, భద్రతను, ఆరోగ్యాన్ని పెట్టుబడిదార్ల ప్రయోజనాల కోసం పణంగా పెట్టాయి. గౌరవ వేతనం, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, నిర్ణీత కాలపరిమితి ఉద్యోగాల పేర్లతో పర్మినెంట్ ఉద్యోగాలు లేకుండా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆస్తులైన విశాఖపట్నం స్టీల్ ప్లాంట్, ఓడరేవులు, రైల్వేలు, విద్యుత్, విమానాశ్రయాలు, ఎల్ఐసి, జాతీయ రహదారులను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు ధారదత్తం చేస్తోందని విమర్శించారు. సమావేశంలో ఎస్.వల్లభరావు, ఎ.కృష్ణారావు, బి.వెంకటేశం, జయరాం, తాతాయ్య, యాదవయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

'ఉక్కు'పై బిజెపి అక్కసు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

'నవ్వి పోదురుగాక మాకేటి సిగ్గు అన్న తీరు'గా ఉంది బిజెపి నేతల తీరు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేసే ప్రయత్నాలు సాగిస్తూనే... ప్రయివేటీకరణను అడ్డుకుంటున్న వామపక్షాలు, ఇతర ప్రజా సంఘాలపై బిజెపి ఎంపి జివిఎల్ నరసింహారావు నోరుపారేసుకోవడంపై తీవ్ర విమర్శలకు దారితీసింది. శ్రీకాకుళంలో ఈ నెల 23న రాజ్యసభ సభ్యులు జివిఎల్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో విశాఖ ఉక్కు పోరాటంపై తన అక్కస్సు వెళ్లగక్కారు. విశాఖ ఉక్కును కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దక్షిణ కొరియాకు చెందిన పోస్కో కంపెనీ, అదానీ వంటి కార్పొరేట్లకు కారు చౌకగా అమ్మేసేందుకు ఇప్పటికీ రకరకాల ప్రయత్నాలు చేస్తూనే ఉంది. కేంద్రం తీరును నిరసిస్తూ విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన వామపక్షాలు, ప్రజా, కార్మిక, ఉద్యోగ సంఘాల నాయకులు విశాఖపట్నం కూర్మనపాలెంలో వెయ్యి రోజులకు పైగా దీక్షలు సాగిస్తూనే ఉన్నారు. ఓ పక్క దీక్షలు కొనసాగిస్తుండగానే మరోవైపు ప్లాంట్ ప్రయివేటీకరణకు కేంద్ర ప్రభుత్వం తన పయత్నాలు సాగిస్తూనే ఉంది. నాడు ప్లాంట్ ఏర్పాటు కోసం పోరు సాగిస్తే నేడు దానిని కాపాడుకోవడం కోసం అవిశ్రాంతంగా పోరు సాగిస్తున్నారు. 32 మంది ప్రాణాలు అర్పించడంతో పాటు వామపక్ష ఎంపీల రాజీనామాలతో నాడు విశాఖ ఉక్కును సాధించుకోలిగారు. ఇంతింతై వటుడింతై అన్నట్లు ప్లాంట్ ఆస్తుల విలువ ఇప్పుడు లక్షల కోట్లకు చేరింది. పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తోంది. కరోనా కాలంలో దేశ వ్యాప్తంగా ఆక్సిజన్‌ను సరఫరా చేసి ఆపద్బాంధువుగా నిలిచింది. రోగులకు ప్రాణం పోసిన స్టీల్ ప్లాంట్ ప్రాణాలనే తీసేందుకు బిజెపి ప్రభుత్వం ప్రయత్నాలు సాగిస్తోంది. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా నష్టాలు బారిన పడేలా చేసి, తర్వాత నష్టాలను సాకుగా చూపి ప్రయివేటీకరణకు తెగబడుతోంది. అలుపు ఎరగని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పోరాటం వల్లే విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆగిందని చెప్పడంలో ఎటువంటి సందేహం అవసరం లేదు. బిజెపి నేతలు మాత్రం వాస్తవాలను విస్మరించి నోటికొచ్చినట్లు మాట్లాడటం వారికే చెల్లింది. స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ ఆగిందంటూ బిజెపి ఎంపి జివిఎల్ చెప్పడం విడ్డూరంగా ఉంది. ఆ మాట చెప్పాల్సింది కేంద్ర ప్రభుత్వం. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఓ వైపు ప్రయివేటీకరణ ప్రయత్నాలు చేస్తూ... మరో పక్క ఆ పార్టీ ఎంపీ మాత్రం ప్రయివేటీకరణ నిలిచిపోయిందని చెప్పడం ప్రజలను వంచించడమే అవుతుంది. దేశంలో 40 మిలియన్ టన్నుల స్టీల్‌ను ఉత్పత్తి చేస్తున్న ఓ ప్రయివేట్ కంపెనీ కేవలం 4 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే విశాఖ ఉక్కు పరిశ్రమ 7.3 మిలియన్ టన్నులను ఉత్పత్తి చేస్తూ 32 వేల మందికి ఉద్యోగాలను కల్పిస్తోంది. విశాఖ ఉక్కును బిజెపి ప్రభుత్వం పయివేటీకరిస్తే రాబోవు రోజుల్లో జరిగేది ఇదే. వాస్తవాలను తెలుసుకోకుండా కొందరి వల్ల స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు నష్టపోతున్నారంటూ ఎంపీ జివిఎల్ నరసింహారావు మొసలికన్నీరు కారుస్తున్నారు. ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న వారి నుద్దేశించి ఎంపీ అవాకులు చెవాకులు పేలడంపై జనం మండిపడుతున్నారు

ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందిపోతుందంటూ ఎంపీ జివిఎల్ చెప్పడం ఆశ్చర్యంగా ఉంది. విశాఖను కేంద్రం గ్రోత్ హబ్‌గా తీసుకొందని గొప్పలు చెప్తున్నారు. విభజన చట్టంలో పేర్కొన్న అంశాల అమలు జోలికి మాత్రం వెళ్లడం లేదు. విశాఖకు రైల్వే జోన్ ఇవ్వకుండా తొమ్మిదేళ్లుగా జనాన్ని మోసం చేస్తూనే ఉన్నారు. రైల్వే జోన్ ఇస్తే ఉత్తరాంధ్ర ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అదే పెద్ద గ్రోత్ హాబ్ అవుతుందే తప్ప ఉత్తుత్తి హబ్‌లతో ఏం ప్రయోజనం ఒనగూరుతుంది. విభజన చట్టం ప్రకారం ఉత్తరాంధ్రలోని మూడు, రాయలసీమ జిల్లాలోని నాలుగు జిల్లాలకు ఇవ్వాల్సిన వెనుకబడిన నిధులను ఐదేళ్లుగా బిజెపి ప్రభుత్వం ఆపేసింది. చట్టం ప్రకారం ఈ ప్రాంతానికి రావాల్సిన నిధులు, రైల్వే జోన్ ఇవ్వకుండా ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందంటూ బిజెపి ఎంపీ చెప్పడం ప్రజలను మోసగించడమే అవుతుంది. ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం చేస్తున్న బిజెపిపై ఇప్పటికే ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. జనం వద్దకు వెళ్లేందుకు ముఖం చెల్లక కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతో చేపడుతున్న పనుల పరిశీలన పేరుతో జిల్లాల్లో ఆ పార్టీ రాష్ట్ర నేతలు పర్యటిస్తున్నారు. బిజెపి అధ్యక్షులు పురంధేశ్వరి ఈ నెల 24న జిల్లా పర్యటనకు వచ్చారు. శ్రీకాకుళం నగరంలో మిర్తిబట్టి వద్ద కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న తాగునీటి శుద్ధి కేంద్రం సందర్శించాలని తొలుత నిర్ణయించి... తర్వాత రద్దు చేసుకున్నారు. జిల్లా అభివృద్ధికి కేంద్రం ఎంతెంత మొత్తంలో గ్రాంట్ల రూపంలో ఇస్తుందో విలేకరుల సమావేశంలో ఏకరవు పెట్టారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, జిల్లాలకు కేంద్రం నిధులు ఇవ్వడం అభివృద్ధి ప్రక్రియలో నిరంతర భాగంగానే చూడాలి. కేంద్రంలో ఇప్పుడు బిజెపి ఇస్తే గతంలో దేశాన్ని పాలించిన పార్టీలు నిధులను కేటాయించాయన్న విషయం గుర్తించాలి. ఇది సర్వసాధారణ అంశం. ఇవి కాకుండా జిల్లాకు ప్రత్యేకంగా ఏమి ఇచ్చారో, విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను ఎంత వరకు బిజెపి ప్రభుత్వం అమలు చేసిందనే అంశాలకు మాత్రం బిజెపి నేతల నుంచి సమాధానం రావడం లేదు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మాయ మాటలతో జనం మధ్య వచ్చేందుకు వస్తున్న బిజెపిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

మాట్లాడుతున్న ఆర్‌డిఒ భరత్ నాయక్

ఓటరు నమోదుపై అవగాహన

ప్రజాశక్తి- పలాస

18 ఏళ్ళ నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని, ఓటుహక్కు వినియోగించు కోవాలని ఆర్‌డిఒ భరత్ నాయక్ యువతకు సూచించారు. కాశీబుగ్గ విద్యా వాహిని కళాశాలలో శనివారం ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఓటుపై చైతన్యపర్చి ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టంగా ఉండాలంటే యువత చేతుల్లోనే ఉందన్నారు. మీ చేతిలో ఉన్న ఏకైక వజ్రాయుధం ఓటని, ఇలాంటి ఓటును డబ్బు, కులం, మతం, ప్రాంతం, మద్యం వంటి ప్రలోభాలకు లొంగ కుండా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎల్.మధుసూదన్, శ్రీవిద్యావాహిని కళాశాల కరస్పాండెంట్ పైల తిరుమలరావు, ఎలక్షన్ డిటి రాంబాబు, ప్రిన్సిపాల్ గిరిబాబు, ఎఒ పైల మన్మథరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రమణ

ఇంటి పన్ను వసూలు వేగవంతం

ప్రజాశక్తి- పలాస

గ్రామాల్లో ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని డివిజన్ పంచాయతీ విస్తరణ అధికారి ఐవి రమణ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కేంద్రం ఏయే పథకాలు ఇస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఏయే పథకాలు అందిస్తున్నాయి, వాటి ఉపయోగాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. గ్రామాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. పంచాయతీల్లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ రమేష్ నాయుడు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కిట్లను అందిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

క్రీడాకారుల్లో ప్రతిభకు కొదవ లేదు

ప్రజాశక్తి- కవిటి

గ్రామీణ ప్రాంతాల క్రీడాకారుల్లో ప్రతిభకు కొదవలేదని, వారిలోని ప్రతిభను వెలికితీసి బాహ్య ప్రపంచానికి తెలియచెప్పేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం రూపొందించినట్టు జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియ విజయ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించిన క్రీడా వస్తువులు ఆయా పంచాయతీల కార్యదర్శులకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో మానసిక వికాసం పెంపొందని, పోటీతత్వం అలవడుతుందన్నారు. పంచాయతీల నుంచి జిల్లాస్థాయి వరకు జరగనున్న ఈ పోటీలను క్రీడాకారులు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, ఎఎంసి వైస్ చైర్మన్ వై.నీలయ్య, ఎఐబి చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి, రెడ్డికి జెఎసి కన్వీనర్ బర్ల నాగభూషణం, దుగానపుట్టుగ సర్పంచ్ భద్రాచలం, ఎంపిటిసి పూడి నీలాచలం, ఎన్ని అశోక్, నర్తు శివాజీ, ప్రవీణ్, ఎంపిడిఒ సూర్యనారాయణ రెడ్డి, ఎఒ శ్రీనివాసరెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

నమూనా పోలింగ్ నిర్వహిస్తున్న హెచ్ఎం లత

విద్యార్థులతో నమూనా పోలింగ్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక మున్సిపల్ పురుషోత్తంపురం ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పురుషోత్తపురం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వై.లత ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభం, పోలింగ్ తీరుపై అవగాహన కల్పించారు. 3 నుంచి 10వ తరగతి చెందిన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్నికల తీరుపై నమూనా పోలింగ్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవరాజు, ఆదిలక్ష్మి రాంప్రసాద్, రాజ్యలక్ష్మి, సుధ, జయంతి పాల్గొన్నారు.

సతీష్‌ను సత్కరిస్తున్న ఎంపిపి, గ్రామస్తులు

ఆల్ ఇండియా ఐఇఎస్‌లో 15వ ర్యాంకు

ప్రజాశక్తి- పోలాకి

మండలం చీడివలస పంచాయతీ జిల్లేడు మాకివలస గ్రామానికి చెందిన గొల్లంగి సతీష్ ఆల్ ఇండియా ఐఇఎస్ (ఇంజనీరింగ్ విభాగం)లో 15వ ర్యాంకు సాధించారు. ఆల్ ఇండియా స్థాయిలో 15వ ర్యాంకు సాధించిన గొల్లంగి సతీష్‌ను ఎంపిపి ముద్దాడ బైరాగి నాయుడు, సర్పంచ్ ముద్దాడ రాము, గ్రామపెద్దలు, ప్రజలు అభినందనలు తెలియజేసి దుశ్శాలువతో సత్కరించారు.

తిలక్ పరామర్శ

కోటబొమ్మాళి : మండలంలో పలు గ్రామాల్లో అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలకు రాష్ట్ర కళింగ కోర్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ శనివారం పరామర్శించారు. కొత్తపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కార్యకర్త దుబ్బ రమేష్, కళింగపట్నం కృష్ణ కుటుంబాలకు, సీతారాంపురంలో పంకు వరహాలమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయనతో పాటు రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, పేడాడ వెంకటరావు, బెలమర మహేష్, పంకు సింహాచలం, పిట్ట శ్రీనివాస్, కూన దాలప్ప, పేడాడ దామోదర్, కొండాల సిమ్మయ్య ఉన్నారు.

బాలికులలకు చదువే ముద్దు

ఆమదాలవలస : ర్యాలీలో పాల్గొన్న స్పీకర్ సీతారాం

శ్రీకాకుళం అర్బన్ : ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

సమాజంలో కుల, మత, జాతి, వ్యత్యాసాలతో పాటు ఏ కుటుంబంలో కూడా స్త్రీ, పురుషుల మధ్య జండర్ వివక్ష వద్దని, సమ సమాజ స్థాపనకు బాలు బాలికలందరికీ చదువు ముద్దని స్పీకర్ తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. శనివారం శ్రీనివాసాచార్యుల పేటలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాటు చేసిన జండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జరిపిన జాతీయస్థాయి ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్నారు. రేపటి తరాల్లో ప్రతి కుటుంబం భవిష్యత్ కూడా తమ పిల్లల చదువు, ఆరోగ్యంపైనే ఆధారపడి ఉంటుందని, దానిని దృష్టిలో ఉంచుకొని సిఎం జగన్మోహన్ రెడ్డి విద్య, వైద్యం, సేద్యం, తాగునీరు, సాగునీరుకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు గురుగుబెల్లి ప్రభాకరరావు, ఎంపిడిఒ వాసుదేవరావు, మండల సర్వేయర్ బొడ్డేపల్లి గోపి, ఎపిఎం పైడి కూర్మారావు, క్లస్టర్ కో-ఆర్డినేటర్ సుభద్ర, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, గ్రామ సంఘం ప్రతినిధులు సుశీల, లక్ష్మి, మహిళా సంఘాల నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాలను అనుసరించి డిఆర్‌డిఎ ఆధ్వర్యాన నగరంలో లింగ ఆదారిత వివక్షతకు వ్యతిరేకంగా మహిళా సమాఖ్య ర్యాలీ నిర్వహించారు. నగరంలోని పాతశ్రీకాకుళం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ కొనసాగింది. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు మూల కృష్ణవేణి జెండాను ఎగుర వేసి ర్యాలీ ప్రారంభించారు. సెర్ప్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్. వైకుంఠరావు, బి.నారాయణరావు, మోహనరావు, ఎపిఎం ఎన్ .ధనలక్ష్మి, బ్యాంకు లింకేజీ డిపిఎం ఎన్.నాగలక్ష్మి, బాలల హక్కుల పరిరక్షణ కమిటీ అధికారి మల్లేశ్వరరావు, మహిళా పోలీస్ రేణుకాదేవి పాల్గొన్నారు.

నందిగాం: లింగ వివక్షత, బాల్యవివాహాల నిర్మూలనపై శుక్రవారం నందిగాంలో ర్యాలీ నిర్వహించారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ బాల్యవివాహల నిర్మూలనపై గ్రామాల్లో మహిళా సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి చైతన్య పర్చాలని కోరారు. కార్యక్రమంలో ఎపిఎం సిహెచ్ సీలవేణి, కల్లాడ సర్పంచ్ మడపాల తిరుపతిరావు, ఐకెపి సిబ్బంది, ఎస్ఐఎం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మెళియాపుట్టి: పురుషులతో పాటు స్త్రీలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, లింగ వివక్ష, హింస చూపొద్దని తహశీల్దార్ పి.సరోజిని, ఎంపిడిఒ చంద్రకుమారి అన్నారు. అంతర్జాతీయ మహిళా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వెలుగు కార్యాలయం నుంచి మూడు రోడ్ల వరకు పలు నినాదాలు చేస్తూ అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఆడ, మగ ఇద్దరూ సమానమేనన్న దృక్పథం ప్రతిఒక్కరు అలవర్చుకొని లింగవివక్షకు ముగింపు పలకాలన్నారు. కార్యక్రమంలో ఎపిఎం లలిత, ఎస్ఐ బి.అప్పన్న, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో విఒలు జెండర్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీలు, సమావేశాలు, ప్రతిజ్ఞలు, మానవహారాలు చేపట్టారు. వెలుగు ఎపిఎం ప్రసాదరావు ఆధ్వర్యంలో గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ మహిళా సంఘాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిసిలు, విఒఎలు, సంఘసభ్యులు, స్థానిక అంగన్వాడీ వర్కర్లు, ఆశవర్కర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లావేరు: మహిళలు నేటి సమాజంలో అన్నిరంగాల్లో రాణిస్తూ ముందుండాలని ఎంపిడిఒ కుప్పిలి సురేష్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జెండర్‌పై లింగ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ లింగ వివక్షతపై గ్రామాల్లో ప్రజలను చైతన్యం కలిగించాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం మావూరి మాధవిలత, వెలుగు సిసిలు, పోలీసులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, స్వయం శక్తి సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పలాస: లింగ వివక్షత లేకుండా చూడాలని డివిజన్ పంచాయతీ విస్తరణ అధికారి ఐవి రమణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం లింగ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా వెలుగు మండల అధ్యక్షులు, విఒ అధ్యక్షులు, మండలస్థాయి అధికారులు, సచివాలయం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయం వద్ద మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్.రమేష్ నాయుడు, పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, వెలుగు ఎపిఎం మల్లేశ్వరరావు, కార్యదర్శులు, వెలుగు అధికారులు పాల్గొన్నారు.

బూర్జ: సమాజంలో మహిళను గౌరవించి సాంప్రదాయాలను కాపాడుకోవాలని జెడ్‌పిటిసి బెజ్జిపురం రామారావు, రాష్ట్ర టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు అన్నారు. అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బూర్జలో మహిళలు, పురుషులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు ర్యాలీ నిర్వహించి మానవహారం చేశారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు రమ్య, రాజశేఖర్, ఎస్ఐ అశోక్ బాబు, ఎఎంసి మాజీ చైర్మన్ గుమ్మడి రాంబాబు, ఎంపిడిఒ రవీంద్రబాబు, తహశీల్దార్ రమణారావు, వెలుగు ఎపిఎం రాంబాబు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఉదయ్ కుమార్, వైసిపి నాయకులు రాజారావు, కొత్తకోట వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు డ్వాక్రా సంఘ మహిళలు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: సమాజాన్ని జాగ్రుతి పర్చడంలో మహిళలు కీలక భూమిక పోషించాలని ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్ అన్నారు. లింగ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా నాలుగు వారాలు పాటు నిర్వహించే కార్యక్రమాలను శనివారం మండల కాంప్లెక్స్‌లో ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశవరావు, తహశీల్దార్ బి. అప్పలస్వామి, ఇఒపిఆర్‌డి డిడి.తిరుమలరావు, ఎపిఎం కోడూరు జాంబవతి, ఎంపిటిసి ఉరిటి కామేశ్వరరావు, సర్పంచ్‌లు పిట్ట గీత, డి.భాస్కరరావు, కె.మల్లేశ్వరస్వామి, టి.సుశీల, కొల్లి భాస్కరరావు, గూడ ఈశ్వరరావు, వంక చిరంజీవి, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: దేశం ఎన్నో సాంకేతిక విప్లవాలతో అభివృద్ధి చెందుతున్నప్పటికీ ప్రజలు ఇంకా లింగ వివక్షతను విడనాడడం లేదని ఎంపిడిఒ పివివి మురళీమోహన్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో లింగ వివక్షతపై అంగన్వాడీలు, డ్వాక్రా మహిళలు, ఆశ కార్యకర్తలతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. లింగ వివక్షత చట్టరీత్యా నేరమన్నారు. ఈనెల 25 నుండి డిసెంబర్ 22 వరకు గ్రామాల్లో అన్ని శాఖల ఆధ్వర్యంలో లింగ వివక్షతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎం కమలకుమారి, ఐకెపి సిబ్బంది, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కవిటి: సమాజంలో లింగ వివక్షకు తావులేదని, సంఘంలో స్త్రీ పురుషులు ఇరువురు సమానమేనని ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ అన్నారు. లింగ వివక్షత రూపుమాపాలని ప్రతిజ్ఞ చేసి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, ఎన్ని అశోక్, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, ఎపిఎం గోవిందరావు, అంగన్వాడీ సూపర్ వైజర్లు కృష్ణవేణి, పల్లవి పాల్గొన్నారు.

నందిగాం : సదస్సులో మాట్లాడుతున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి

మెళియాపుట్టి : ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పలాస : మానవహారం నిర్వహిస్తున్న అధికారులు

విద్యార్థులు నైపుణ్యం కలిగి ఉండాలి

ఆదిత్య కళాశాల సిఇఒ గుప్త

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతి విద్యార్థికీ చదవుకునే దశ ఎంతో కీలకమని, ఈ సమయాన్ని వృథా చేసుకోకుండా సత్ప్రవర్తన కలిగి ఉండడంతో పాటు నైపుణ్యాన్ని పెంచుకోవడం ద్వారా ఉన్నత శిఖరాలు చేరుకోగలరని ఆదిత్య డిగ్రీ అండ్ పిజి కళాశాల సిఇఒ ఎంఎస్ఎస్ గుప్త అభిప్రాపడ్డారు. కళాశాల ప్రిన్సిపాల్ తూలుగు విజయకుమార్ నాయుడు అధ్యక్షత 23వ వార్షికోత్సవం నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ, పిజి కళాశాల ఆవిర్భవించిన తర్వాత ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దామని అన్నారు. క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా ఎంతో మంది మంచి ఉద్యోగాలు సాధించారని అన్నారు. క్రమశిక్షణతో చదవుకుంటే మంచి భవిష్యత్ సాధ్యమవుతుందన్నారు. నాణ్యమైన విద్య నందించడంతో పాటు కళాశాలలో నైపుణ్యాన్ని అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యాజమాన్య సభ్యులు మాడుగుల మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డి.శైలజ, అధ్యాపక సిబ్బంది నరేష్ రమేష్, నిరంజన్, మీనాక్షి, శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు జ్ఞాపికలను బహూకరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మాట్లాడుతున్న గుప్త

గడప గడపకూ సంక్షేమం

ప్రజాశక్తి- ఆమదాలవలస

అర్హత కలిగిన గడపగడపకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు వెల్లువలా కొనసాగుతున్నాయని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని శ్రీనివాసా చార్యులపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల ఈ నాలుగున్నరేళ్లలో అందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హత కలిగిన లబ్ధిదారునికీ నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నగదును జమ చేసి ఆర్థికభరోసా కల్పిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని కొనియాడారు. పేదల ఆత్మగౌరవాన్ని పెంచేలా ముఖ్యమంత్రి అడుగులు వేస్తున్నారని అన్నారు. సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి ప్రజలకు పాలనను చేరువ చేశారని అన్నారు. గత ప్రభుత్వం మాదిరి జన్మభూమి కమిటీలు నేడు లేవని దళారులు, అవినీతి లేని పాలనను ప్రజలకు అందిస్తున్నారని అన్నారు. విద్య, వైద్యం, సేద్యం రంగాలకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, ఎంపిటిసి మాజీ సభ్యులు గురుగుబెల్లి ప్రభాకరరావు, సర్పంచ్ ప్రతినిధి గురుగుబెల్లి నీలారావు, ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, విద్యుత్‌శాఖ ఎఇ రవికుమార్, ఎపిఎం పైడి కూర్మారావు పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

7న బిసిల పోరాట రథయాత్ర

ప్రజాశక్తి- పలాస

దశాబ్దాలు గడుస్తున్నా బిసిలకు సమన్యాయం జరగలేదని, బిసిల రాజ్యాధికారం కోసం మరో స్వాతంత్ర పోరాట రథయాత్రను జాతీయ బిసి సంక్షేమసంఘం ఆధ్వర్యంలో ప్రారంభిస్తున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షులు పిట్ట చంద్రపతిరాజు తెలిపారు. డిసెంబర్ 7న ఇచ్ఛాపురం నుంచి ప్రారంభం కానున్న రథయాత్ర జయప్రదం చేయాలని కోరుతూ శనివారం రాష్ట్ర పశుసంవర్ధక, డైరీ అభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బిసిలకు 90 అసెంబ్లీ నియోజకవర్గాలు, 13 పార్లమెంటు స్థానాలకు అన్ని రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. జాతీయ పార్టీలు 275 పార్లమెంటు స్థానాలను బిసిలకు కేటాయించాలని ఎజెండాతో ఈ పోరాట రథయాత్ర చేపడుతున్నట్లు వివరించారు. ప్రతి బడుగు బలహీన వర్గాల చెందిన వ్యక్తులు బిసిల పోరాట రథయాత్రలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు అమరుల్లా బెన్, వజ్రపుకొత్తూరు ఎంపిపి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, గొర్రెలు, మేకలు సహకార అభివృద్ధి సమైక్య జిల్లా అధ్యక్షులు రాపాక చిన్నారావు, పాలీన ప్రసాద్, తిప్పనా గాంధీ పాల్గొన్నారు.

కవిటి: వైసిపి ప్రభుత్వంలో బిసిలకు పెద్దపీట వేస్తునట్టు ఎమ్మెల్సీ నర్తు రామారావు తెలిపారు. బిసి సంక్షేమం, హక్కులతో కూడిన వాల్‌పోస్టర్ శనివారం ఎమ్మెల్సీ రామారావు కొత్తపుట్టుగలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇచ్ఛాపురం నియోజకవర్గంలో డిసెంబర్ 7వ తేదీన బిసి సంక్షేమం, హక్కుల రథయాత్ర ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 120 నియోజకవర్గాల్లో జరగనున్న ఈ రథయాత్ర తిరుపతిలో ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్ట చంద్రపతి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ అమిల్లా బేగ్, కె.వెంకటరమణ, బీన ఢిల్లీరావు, తిప్పన గాంధీ, సాలిన ప్రసాద్, ఈరోతు శ్రీనివాస్, పిట్ట హేమ సుందర్, కోట హరికృష్ణ, బి.అశోక్ పాల్గొన్నారు.

పలాస : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సీదిరి

నేడు విద్యుత్ బిల్లుల స్వీకరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను ఆదివారం చెల్లించుకునేందుకు వీలు కల్పించినట్టు తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సూపరింటిండెంట్ ఇంజినీర్ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. ఈమేరకు ప్రకటన విడుదల చేశారు. ఈ సౌకర్యాన్ని వినియోగదారులు సద్వినియోగ పర్చు కోవాలని ఆయన సూచించారు.

మురుగునీటి సమస్యను పరిష్కరించాలి

శ్రీకాకుళం అర్బన్: నగరపాలక సంస్థలో విలీనమైన చాపురం అర్బన్ ప్రాంతంలో అనేక కాలనీల్లో రోడ్లపైనే మురుగునీరు ప్రవహిస్తోందని, ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని వైసిపి నాయకులు ధర్మాన రాంమనోహర నాయుడు కమిషనర్ చల్లా ఓబులేసును కోరారు. శనివారం ఆయనతో పాటు కాలనీల్లో పర్యటించిన ధర్మాన చాపురం గ్రామంలోను, అర్బన్ ప్రాంతంలో ఉన్న కాలనీల్లో డ్రెయినేజి వ్యవస్థ లేక పోవడంతో ఇళ్లలో వినియోగిస్తున్న మురుగునీటి రోడ్లపైకి విడిచి పెడుతున్నారని అన్నారు. దీనివల్ల లోతట్టు ప్రాంతంలో ఉన్న రోడ్లపైకి మురుగునీరు చేరుతోందని వివరించారు. తాత్కాలికంగా రోడ్లకు ఇరువైపులా మురుగునీరు వెళ్లేందుకు కాలువలను తవ్వాలని సూచించారు. అలాగే కొన్నిచోట్ల తాగునీటి కోసం వేసిన పైపులైన్ లీకులు ఉన్నాయని, వాటిలో మురుగు చేరడం వల్ల నీరు కలుషితమవుతోందని వివరించారు. వారితో పాటు శానిటేషన్ ఇన్పెక్టర్ గణేష్, మాజీ సర్పంచ్‌లు అల్లు లక్ష్మీనారాయణ ఉన్నారు.

బిసి సంఘం అధ్యక్షులుగా త్రినాథ్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జాతీయ బిసి సంక్షేమ సంఘం ఇచ్ఛాపురం నియోజకవర్గ అధ్యక్షునిగా బుడ్డెపు త్రినాథ్‌ని నియమించారు. బిసి సంఘం జిల్లా అధ్యక్షులు పిట్ట చంద్రపతి చేతుల మీదుగా శనివారం నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈయన నియామకంపై పిఎసిఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్రయాదవ్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రతినిధి పిలక దేవరాజ్ (సంతు) కృతజ్ఞతలు తెలిపారు. బిసిల రాజకీయ సాధికారత సాధన దిశగా కృషి చేస్తానని త్రినాథ్ తెలిపారు.

బాలలను పనిలోకి తీసుకోవద్దు

టెక్కలి: బాల, కౌమార కార్మికుల రక్షణ, పునరావాస ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం ఇన్‌ఛార్జి చైర్మన్, మండల న్యాయ సేవాధికార సంస్థ, సీనియర్ సివిల్ జడ్జి జె. శ్రీనివాసరావు ఆదేశాలు మేరకు టెక్కలి న్యాయవాదుల సంఘం అధ్యక్షులు డి.వి.వివేకానంద అధ్యక్షతన సహాయ కార్మిక అధికారి రాధాకుమారి సమక్షంలో పట్టణంలో పలు దుకాణాలు తనిఖీ చేసి దుకాణ యజమానులకు బాలలను దుకాణాల్లో పనికి పెట్టడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శి బాలకృష్ణ, న్యాయవాదులు రాజేశ్వరరావు, ఆనందరావు, గోవింద్, కేశవరావు, చైల్డ్ లైన్ సభ్యులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

బాల్య వివాహాలు నేరం

పోలాకి : వెలుగు కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- పొందూరు

ఏళ్లు నిండకుండా బాలికలకు వివాహం చట్టరీత్యా నేరమని ఎంపిడిఒ ఎస్. హరిహరరావు, వెలుగు ఎసి రవి అన్నారు. మండల కేంద్రంలో వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో బాల్యవివాహాలు, బాలికలపై అఘాయిత్యాలపై పట్టణంలో డ్వాక్రా మహిళలతో ర్యాలీ నిర్వహించారు. బాలికలను ఏవిధంగా వేధించినా చర్యలు తప్పవన్నారు. బాల్య వివాహాలకు పాల్పడితే వరుడుతో పాటు ఇరువురి తల్లిదండ్రులపైనా చర్యలు, కేసులు తప్పవని బాల్యవివాహాలను అడ్డుకోవలసిన బాధ్యత అంగన్వాడీ, ఐసిడిఎస్, రెవెన్యూ, మహిళా పోలీసులపై ఉందన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఎం జి.శ్యామలరావు, ఎపిఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలాకి: బాల్య వివాహాల నిర్మూలనపై శనివారం వెలుగు ఎపిఎం రాజారావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగినాయుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలకు ప్రోత్సాహిస్తారని, ఇది చట్టరీత్యా నేరమని, దీనిని ప్రతిఒక్కరూ తెలుసుకుని బాల్య వివాహాలు నిర్మూలనపై కృషి చేయాలన్నారు. ప్రధాన కూడళ్లలో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి మజ్జి లక్ష్మి నారాయణ, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, వైసిపి నాయకులు త్రినాథరావు, ఎంపిటిసి ప్రతినిధి తూలుగు అశోక్ కుమార్, రావాడ అప్పన్న రాజు, చింతు రామకృష్ణ, వెలుగు సిసిలు, సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరు : మానవహారం నిర్వహిస్తున్న అధికారులు, మహిళలు

భవన నిర్మాణ పనులు వేగవంతం

ప్రజాశక్తి- నందిగాం

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి పథకాల్లో భాగంగా సచివాలయ భవనాలు, రైతు భరోసా, వెల్నెస్ సెంటర్స్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సకాలంలో పనులు పూర్తి చేయాలని కోరారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇంజినీరింగ్ అధికారులు కాంట్రాక్టర్లకు సకాలంలో పనులు రికార్డు చేసి సూచనలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శివప్రసాద్, ఇంజినీరింగ్ అధికారి పి.సంతోష్, మండల పరిషత్ ప్రత్యేక అహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, సర్పంచ్‌లు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి

మెరిసిన సంతవురిటి పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి- జి.సిగడాం

మండలం సంతవురిటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నియోజకవర్గ స్థాయి తొగరాంలో జరిగిన స్కూల్‌గేమ్స్‌లో పతకాలు సాధించారు. ఆ స్కూల్ విద్యార్థులు ఆడిన ప్రతి ఆటలో వారు విజయం సాధించారు. జూనియర్స్ విభాగంలో 100, 200 మీటర్స్ పరుగు పందెంలో ప్రథమ స్థానం దుర్గాప్రసాద్, 400, 600 మీటర్స్ పరుగు పందెంలో సిహెచ్ రాహుల్, అలాగే సీనియర్స్ విభాగంలో 100, 200 మీటర్స్ పరుగు పందెంలో డి.భానుప్రసాద్ ప్రథమ, ద్వితీయ స్థానాలు, 400 మీటర్స్ పరుగు పందెంలో బాలాజీ ప్రథమ స్థానం, 1500 మీటర్స్ పరుగు పందెంలో పి.హేమంత్ ప్రథమస్థానం, టి తేజ ద్వితీయ స్థానాలు కైవాసం చేసుకున్నారు. మొన్న జరిగిన మండలస్థాయి గ్రిగ్స్ పోటీల్లో ఖోఖో పురుషులు, మహిళలు విభాగాల్లో ప్రథమస్థానాన్ని సాధించారు. ఇన్ని విజయాలు తెచ్చి పెట్టిన విద్యార్థులకు, వ్యాయామ ఉపాధ్యాయలు యుగంధర్‌కు ప్రధానోపాధ్యాయులు టి.జయలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించి విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రధానోపాధ్యాయులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జి.సిగడాం : ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

కెజిబివి...

పొందూరు: ఆమదాలవలస మండలం తొగరాం గ్రామంలో శుక్రవారం జరిగిన నియోజకవర్గ గ్రిగ్స్ పోటీల్లో మండలంలోని లోలుగు కెజిబివి విద్యార్థినులు ప్రతిభ కనపర్చారు. ఈ పోటీల్లో వాలీబాల్ జూనియర్స్ విభాగంలో ప్రథమస్థానం సాధించింది. జూనియర్ బాలికల విభాగంలో షార్ట్‌పుట్ త్రోలో వై.జమున, ఎల్.రేష్మ ప్రథమ, ద్వితీయ స్థానాలు, జావిలిన్‌త్రోలో వై.జమున, ఎస్.ఎ.అశ్విని ప్రథమ, ద్వితీయ స్థానాలు, డిస్కస్‌త్రోలో వై.జమున, ఎస్.ఎ.అశ్విని ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. హైజంప్‌లో వి.శ్రావణి తృతీయ స్థానం సాధించింది. సీనియర్ బాలికల విభాగంలో షార్ట్‌పుట్ త్రోలో ఎం.ద్రాక్ష, కె.రాజేశ్వరి ప్రథమ, ద్వితీయ స్థానాలు, జావలిన్ త్రోలో ఎన్,ధనుశ్రీ, ఎం.ద్రాక్ష ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. డిస్క్‌త్రోలో ఎం.ద్రాక్ష ప్రథమస్థానంలో నిలిచింది. వీరు సాధించిన విజయానికి ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య, పిఇటి మొకర రూపవతి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు అభినందించారు.

మాట్లాడుతున్న మధుబాబు

ధాన్యం కొనుగోలుపై శిక్షణ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ప్రతి ఒక్క రైతు భరోసా కేంద్రాన్నీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రంగా మార్చిందని ఎడిఎ మధుబాబు తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు, గ్రామ రెవెన్యూ అధికారులకు, టెక్నికల్ అసిస్టెంట్లకు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ధాన్యం కొనుగోలుపై శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధన మేరకు ధాన్యంలో తేమ శాతం, కర్బన సేంద్రీయ పదార్థాలు సక్రమంగా చూసుకోవాలన్నారు. నాణ్యతతో కూడిన ధాన్యాన్ని మిల్లులకు పంపించాలలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం పూర్తి బాధ్యత గ్రామ వ్యవసాయ సహాయకులదేనిని స్పష్టం చేశారు. తహశీల్దార్ సరోజని మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామ రెవెన్యూ అధికారులను కస్టోడియల్ అధికారులుగా నియమించిందని తెలిపారు. మిల్లు వద్ద యజమానుల నుంచి రైతుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకునే బాధ్యత గ్రామ రెవెన్యూ అధికారులదేనిని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో పనిచేసే అందరూ పరస్పరం సహకరించుకోవాలన్నారు. సివిల్ సప్లయి డిటి భీమారావు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వైకుంఠరావు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

'ఐతమ్' విద్యార్థుల రక్తదానం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ దినోత్సవ సందర్భంగా ఈ రక్తదాన శిబిరం నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ వివి.నాగేశ్వరరావు తెలిపారు. రక్తదానం చేసిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు కళాశాల డైరెక్టర్ అభినందనలు తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎఎస్ శ్రీనివాసరావు, ఎన్‌సిసి హెచ్ బెటాలియన్ సబేదార్ సింగ్, డీన్ డి.విష్ణుమూర్తి పాల్గొన్నారు.

హడ్కో కాలనీలో '104' సేవలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

104 వాహనం ద్వారా ప్రతి నెల ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయటం జరుగుతుందని, దీనికి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలని మేజరు పంచాయతీ సర్పంచ్ కాళ్ళ సంజీవరావు అన్నారు. శనివారం పంచాయతీ పరిధిలో హడ్కోకాలనీలో 104 వాహనం ద్వారా రోగులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి వైద్యులు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సుగర్, బిపి తదితర దీర్ఘకాలిక రోగాలకు మందులు ఉచితంగా అందజేయటం జరుగుతందన్నారు. కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు, గ్రామ పెద్దలు ఉన్నారు.

1న బహిరంగ వేలం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలో జామియా మసీదు ఆవరణలో 300 కొబ్బరి చెట్ల ఫలసాయాన్ని ఏడాది కాలం పాటు పొందేందుకు డిసెంబరు 1న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు మసీదు చైర్మన్ మహిబుల్లా ఖాన్ తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పాటదారులు ముందుగా రూ.2వేలు దరావత్తు చెల్లించాలని, ఆధార్ నకలు కమిటీ సభ్యులకు అందజేయాలని సూచించారు. కమిటీసభ్యులు వేలంపాటలో పాల్గొనడానికి వీలుండదన్నారు. కొబ్బరిచెట్ల సంరక్షణ, కలుపు మొక్కలను తీయడం లీజుదారుని బాధ్యతని తెలిపారు.

ఆవుకు శస్త్రచికిత్స చేస్తున్న వైద్యాధికారి కిరణ్‌కుమార్

పశువులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

పశువులను మేతకు బయటకు వెళ్లినప్పుడు ఏం తింటున్నాయన్నది పాడిరైతులు గమనించాలని, పశువులు తినకూడనవి తింటే ప్రాణానికే ప్రమాదమని పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ అన్నారు. మండలం యలమంచిలి గ్రామానికి చెందిన వేసవి వైకుంఠరావుకు చెందిన ఆవు గతవారం రోజల నుంచి అనారోగ్య సమస్యతో బాధపడుతుండడంతో పాడిరైతు డాక్టర్ కిరణ్‌కుమార్‌ను సంప్రదించగా ఆయన ఆవుకు వైద్యం అందించటంతో శుక్రవారం అవునోటి నుంచి కరెంట్‌తీగ ముక్కలు ముద్దలుగా పడ్డాయి. రాత్రి ఆకస్మికంగా కడుపు ఉబ్బరం రావటంతో డాక్టర్ వెంటనే ఆవును పరిశీలించి శస్త్రచికిత్స చేశారు. పొట్టని కోసి పొట్టలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు, అంట్లుతోమే స్టీల్ స్క్రబ్బర్ ముక్కలు, ప్లాస్టిక్ సంచులు, తాళ్ల ముక్కలను తీశారు. దీంతో ఆవు క్షేమంగా ఉంది.

బిరుసువాడలో పంటకోత ప్రయోగం

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని బీరుసువాడ రెవెన్యూ గ్రామంలో శనివారం వ్యవసాయ శాఖ అధికారులు పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. సోంపేట ఎడిఎ జగన్మోహనరావు, నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఎంపిక చేసిన సర్వే నెంబర్లలో పంటకోత ప్రయోగాలు చేపట్టారు. గణాంకాధికారి రమ్య, భీమా కంపెనీ ప్రతినిధులు వెంకటరమణ, నవీన్‌తో పాటు రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు ఎండిపోయాయని తెలిపారు. శూన్య దిగుబడిగా నిర్ధారించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులతో పాటు రైతులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి పరుగులు

శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న లక్ష్మీదేవి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో గడచిన నాలుగున్నరేళ్లగా సిఎం జగన్మోహనరెడ్డి నవరత్నాల పేరిట ప్రజలను మభ్య పెట్టి మైనింగ్, మద్యం, టాక్స్‌ల రూపంలో పెద్దఎత్తున దోచుకున్నారని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ఆరోపించారు. శనివారం నగరంలోని 15వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రానున్న ఎన్నికల మేనిఫెస్టోను ఆమె వివరించారు. రాష్ట్రానికి చంద్రబాబు అవసరం ఉందని, లేకుంటే భవిష్యత్ శూన్యమవుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, రాష్ట్ర రైతుసంఘ ప్రధాన కార్యదర్శి చింతు సుధాకర్, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి కృష్ణమూర్తి నాయుడు, డివిజన్ ఇన్‌ఛార్జి నూకరాజు యాదవ్, గుడి మౌళి, ఈశ్వరావు, శరత్ పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: టిడిపితోనే ప్రజా సంక్షేమం మెరుగుపడుతుందని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు అంబళ్ల రాంబాబు అన్నారు. మండలంలోని రొట్టవలసలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫోస్టోతో కూడిన పోస్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలు తెలుగుదేశం పార్టీతోనే ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు. వైసిపి సంక్షేమ పథకాలను ఒక చేతితో ఇచ్చినట్లే ఇచ్చి... మరో చేత్తో భారాలను ప్రజలపై వేసి ఇబ్బందులకు గురి చేస్తున్నదని అన్నారు. నిత్యవసరాల ధరలు సగానికి సగం పెంచిన ఘనత వైసిపి పార్టీకే దక్కిందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి మాజీ సభ్యులు తాడేల వెంకటరమమూర్తి, మండల తెలుగు యువత అధ్యక్షుడు తాడేల రాజారావు, తాడేల మల్లేశ్వరరావు మూడడ్ల రామకృష్ణ, తాడేల గోవింద, బెవర రాజారావు, గుజ్జల శ్రీను, మూడడ్ల రాంబాబు, పాల్గొన్నారు.

లావేరు: వైసిపి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, రాష్ట్రానికి మరలా చంద్రబాబు నాయుడుతోనే అభివృద్ధి పరుగులు పెడుతుందని టిడిపి యూనిట్ ఇన్‌ఛార్జి మజ్జి రామ్మూర్తి అన్నారు. శనివారం వేణుగోపాలపురం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా పోస్టర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి ఎన్నికల మేనిఫోస్టోలో సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో యువ నాయకులు ఎం.రామ్మూర్తి, మాజీ ఎంపిటిసి దుర్గశి రాంబాబు, కోటీశ్వరరావు, బంగారు నాయుడు, పోలినాయుడు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలం కొత్తపేట గ్రామ పంచాయతీలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కొత్తపేట మాజీ ఎంపిటిసి, టిడిపి నాయకులు నాయకుడు మక్క లక్ష్మణరావు నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి పోస్టర్లను అందజేశారు. పార్టీ అధికారంలోకి రాగానే చేపట్టబోయే పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజమహంతి శ్రీనివాస్, రామపాత్రుని బాబురావు, ధర్మాన నాగరాజు, శ్రీనివాసరావు, రామిరెడ్డి పాల్గొన్నారు. మండలం చీపుర్లపాడు, హరిశ్చంద్రపురం, తిలారు, సరియాపల్లి తదితర గ్రామాల్లో భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించి పోస్టర్లను ప్రజలకు అందజేశారు.

లావేరు : ప్రచారం చేస్తున్న రామ్మూర్తి తదితరులు

కోటబొమ్మాళి : పోస్టర్లను అందజేస్తున్న మాజీ ఎంపిటిసి లక్ష్మణరావు

కోటబొమ్మాళి : మాట్లాడుతున్న ఎంఇఒ అప్పలరాజు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

శ్రీకాకుళం అర్బన్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ అధ్యక్షతన శనివారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కళాశాల ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతితో పాటు ప్రాథమిక హక్కులు, ప్రాదేశిక సూత్రాలు అనేక అంశాలను రాజ్యాంగంలో పొందుపరిచారని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యనారాయణ, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు చిరంజీవిరావు, ఐ క్యుఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.హరిత, ఎన్సిసి ఆఫీసర్ డాక్టర్ పోలినాయుడు, పొలిటికల్ సైన్స్ ఇన్‌ఛార్జ్ సిహెచ్.రామ్మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు శ్రీనివాసపాత్రో, వెంకట చలమయ్య, వెంకటేశ్వర్లు, బిసిడిఇ కో-ఆర్డినేటర్ వంశీకుమార్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించి ఆయన అడుగుజాడల్లో మనమందరం ముందుకు పోదామని ఎంఇఒలు సంపతిరావు అప్పలరాజు, ఎల్.వి.ప్రతాప్‌లు అన్నారు. రాజ్యాంగ అవతరణ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు డబ్బీరు గోవిందరావు అధ్వర్యంలో సర్పంచ్ కాళ్ళ సంజీవరావుతో కలిసి బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని అవిష్కరించారు. ఎస్. సంజీవరావు, బి. రమేష్, ఎన్.ఉషారాణి, యు.నిర్మల, జి.శ్రీనివాసరావు, సోమేశ్వరరావు, అచ్చెమ్మ, బి.ఆదినారాయణరావు తదితర ఉపాధ్యాయుల ఆర్థిక సహాయంతో ఈ విగ్రహాన్ని ఏర్పటు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ బి.సురేష్, మేమున్నాం సంస్థ సభ్యులు కోరాడ సాయి బృందం, ఉపాధ్యాయులు కెఆర్‌కె రవికాంత్‌రెడ్డి, చలపతిరావు, ఆనందరావు, ఎర్రన్నాయుడు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వైద్య శిబిరాలకు స్పందన

శ్రీకాకుళం అర్బన్ : వంశధార సర్కిల్ కార్యాలయం పరిధిలోని నీటిపారుదల ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణలో భాగంగా జెమ్స్ ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వంద మంది ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బిపి, సుగర్ ఇసిజి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని వంశధార ఎస్ఇ డోల తిరుమలరావు ప్రారంభించారు. జెమ్స్ వైద్య నిపుణులు డాక్టర్ అన్నెపు శశిధర్, డాక్టర్ దివిజ, మెడికల్ ఆఫీసర్ సాయివివేక్, ఏరియా మేనేజర్ బెండి రవిబాబు, నిపుణులు పద్మ, మహాలక్ష్మి, గిరిధర్ పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. అంతకుముందు ఎస్ఇ కార్యాలయంలో ఆరోగ్య సదస్సు నిర్వహించారు.

ఇచ్ఛాపురం : పట్టణంలో సంతపేట యూత్ క్రీ నాగరాజు ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యులు వి.మాధవి, బి.కామేశ్వరి, ప్రవీణ్‌లు 150 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వేడి ఆహారం, నీటిని తీసుకోవాలన్నారు. అనంతరం వైద్యులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జానకిరావు, ఎల్.మోహన్, నగేష్, ఎం.శ్రీను, కె.జగదీష్, నాని, సిద్ధు, శివ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : వైద్య శిబిరంలో మాట్లాడుతున్న తిరుమలరావు

సంతకాలను సేకరిస్తున్న ప్రసాద్, తదితరులు

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- కొత్తూరు

డిసెంబరు 4న దళితలు సామాజిక, ఆర్థిక, భూమి సమస్యలు తదితర 21 డిమాండ్ల పరిష్కారం కోసం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కోటి సంతకాలతో కూడిన విజ్ఞాపన పత్రం ఇచ్చేందుకు ఛలో ఢిల్లీ కార్యక్రమానికి దళితులు తరలి రావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ పులుపునిచ్చారు. శనివారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో దళితుల హక్కుల రక్షణకై సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దళితసంఘం నాయకులు డి.జమ్మయ్య, బి.గుమ్మయ్య, బి.కృష్ణారావు, టి.తిరుపతిరావు, బి.వసంతరావు, పి.నాగభూషణరావు, బి.రామకృష్ణ, రమేష్, శంకరరావు, టి.త్రినాధమ్మ, పొలయ్య, రవి, గిరిజన.సంఘం నాయకులు నిమ్మక అప్పన్న పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

పర్లాకిమిడి : గజపతి జిల్లా పర్లాకిమిడి ఇండోర్ స్టేడియంలో కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ జిల్లా బ్యాడ్మింటన్ పోటీలను శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య ప్రధాన అధికారి డాక్టర్ ప్రదీప్ కుమార్ పాత్ర, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, ఆదివాసీ అభివృద్ధి సంక్షేమ సంస్థ, ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు.

రూ.50వేలు ఆర్థికసాయం

ప్రజాశక్తి- పలాస

జానపద కళలను పర్యవేక్షించడానికి సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక అన్ని విధాలుగా ప్రయత్నిస్తుందని వేదిక గౌరవ సలహాదారుడు డాక్టర్ కుమార్ నాయిక్, రాపాక ధనరాజులు అన్నారు. శనివారం సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో హరిపురం గ్రంథాలయం ఆవరణలో జానపద గాయకుడు గువ్వాడ మల్లేసుకు రూ.50వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దువ్వాడ మల్లేసు పాడిన లింగిడి..లింగిడి..లింగిడి కింద జంగిడి పాటను కోటబొమ్మాళి సినిమాలో వాడుకున్నందుకు సినీ నిర్మాతలు బన్ని వాసు, కొప్పినేని విద్యలతో సంప్రదించి ఆర్థిక సహాయాన్ని అడిగామని వారు తక్షణమే స్పందించి రూ.50వేలు మల్లేసుకు అందజేయాలని కోరానన్నారు. కార్యక్రమంలో వేదిక కోశాధికారి మామిడి కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి బత్తిని రామారావు, ఉపాధ్యక్షులు దున్న రామారావు, గౌరవాధ్యక్షులు బొడ్డు గాంధీ, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి. లోకేశ్వరరావు, దున్న హరికృష్ణ, మాధవరావు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సాహిత్య కళావేదిక సభ్యులు

ఓటర్ల జాబితా సవరణకు మరో అవకాశం

ప్రజాశక్తి- సోంపేట

సత్యనారాయణ, తహశీల్దార్

రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల తుది జాబితా సవరణకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు తహశీల్దార్ సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 26వ తేదీతో పాటు డిసెంబర్ 2, 3 తేదీల్లో బూత్‌లెవెల్ కార్యాలయాల వద్ద ఓటర్ల జాబితాలో సవరణలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో కల్పిస్తున్న ఈ అవకాశాలను స్థానికులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు దరఖాస్తుల స్వీకరణ అనంతరం తుది జాబితాలను ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు.

సచివాలయం సందర్శన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

సచివాలయం సేవలు ప్రజలు వినియోగించుకునేలా సిబ్బంది వాలంటీర్లు కృషి చేయాలని టెక్కలి డివిజన్ అభివృద్ధి అధికారి ఐ.వి.రమణ ఆదేశించారు. మండలంలోని గరుడుభద్ర సచివాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడి రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయంలో అందుబాటులో ఉన్న అన్ని రకాల సేవలను ప్రజలకు అందించాలన్నారు. అనంతరం గ్రామానికి ఆనుకొని ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ గూడ గిరిజ, ప్రతినిధి ఈశ్వరరావు, కార్యదర్శులు బి.మోహన్, ఆర్.కళ్యాణి, వై.అవినాష్, కె.వెంకటేష్, బి.స్వాతి, ఊర్వశి పాల్గొన్నారు.

పిహెచ్‌డి పట్టాను అందుకుంటున్న రంగారావు

రంగారావుకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి- జి.సిగడాం

ప్రతిభకు పేదరికం అడ్డుకాదని, నిరంతరశ్రమ, పట్టుదల, కృషి వుంటే ఏదైనా సాధించవచ్చని రుజువు చేశారు. జి.సిగడాం మండలం వెలగాడ గ్రామానికి చెందిన పెద్ది రంగారావు ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎన్నో సవాళ్ళను అధిగమించి దేశంలోనే పేరు గాంచిన అన్నామలై యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందాడు. సాధారణ విద్యలోనే ఎక్కువ మంది డాక్టరేట్లు పొందుతుంటారు. కానీ విద్యను, వ్యాయామ విద్యను రెండు కళ్లుగా భావించి ఎవరూ ఊహించని విధంగా వినూత్న రీతిలో వ్యాయామ విద్యలో విస్తృత పరిశోధనలు చేసి పిహెచ్‌డి పట్టాను కైవసం చేసుకున్నారు. తండ్రి అమ్మారావు, ఆదిలక్ష్మి దంపతులకు రంగారావు జన్మించారు. వీరిది వ్యవసాయ కుటుంబం. రంగారావు మాట్లాడుతూ హైస్కూలు స్థాయి నుంచే విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకున్నానని, బాల్యదశ నుంచే క్రీడారంగం పట్ల మక్కువతో నిరంతర కృషి వలన ఈ అరుదైన గౌరవం దక్కిందన్నారు.

వినతిపత్రం అందిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

నిధులు మంజూరు చేయాలని వినతి

టెక్కలి: కోర్టు సముదాయానికి కేటాయించిన 94 సెంట్లు భూమిలో నూతన కోర్ట్ భవనాలు, జడ్జి క్వార్టర్స్ నిర్మాణానికి అవసరమైన పరిపాలన అనుమతులు, నిధులు మంజూరు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద, కార్యదర్శి బాలకృష్ణ శనివారం శ్రీకాకుళం వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్ ఫోలియో జడ్జి జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్‌ను కలిసి మెమొరాండం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి సన్యాసినాయుడులను న్యాయవాదుల ప్రతినిధులు కలిశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.సూర్యారావు, కార్యదర్శి పి.రాము పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో శనివారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం పాఠశాలలో పనిచేస్తున్న సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు ఎస్.జ్యోతమ్మ, ఎం.కృష్ణారావులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొర్ల వైకుంఠరావు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులు విడుదల చేయాలి

రణస్థలం: గ్రామాల అభివృద్ధికి నిధులు విడుదల చేయా సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు, రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీ నాయుడు కోరారు. తిరుపతిలో శనివారం నిర్వహించిన సర్పంచ్‌ల శంఖారావంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్, జిల్లాలోని సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కార్యదర్శులతో సమీక్ష

ప్రజాశక్తి- మెళియాపుట్టి

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం టెక్కలి డివిజనల్ పంచాయతీ అధికారి ఐవి రమణ కార్యదర్శిలతో సమీక్షించారు. ఐహెచ్‌ఎల్, విశ్వకర్మ, వికాసిభారత్, ఇంటి పన్ను, ఆన్లైన్ పేమెంట్, కమాండ్ కంట్రోల్ రూమ్ తదితర అంశాలపై సమీక్షించి సూచనలు ఇచ్చారు. లక్ష్యాలకు చేరువ కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ చంద్రకుమారి, కార్యదర్శులు అప్పారావు, శివాజీ, ఢిల్లీరావు, ప్రసాద్, మోహనరావు పాల్గొన్నారు.

ఓటర్ల ప్రతిజ్ఞ

పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 69వ పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు ప్రతిజ్ఞ చేశారు. జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బూత్ లెవల్ ఆఫీసర్లు ఆధ్వర్యంలో ఓటర్లను చైతన్య పర్చి భాగస్వామ్యం చేసే ప్రక్రియలో భాగంగా శనివారం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో 69వ పోలింగ్ స్టేషన్ వద్ద కేంద్ర ఎన్నికల కమిషన్ రూపొందించిన ప్రతిజ్ఞను ప్రత్యేకంగా యువ ఓటర్లచే బూత్ లెవల్ ఆఫీసర్ కన్యాకుమారి ప్రతిజ్ఞ చేయించారు.

పాఠశాల వార్షిక బడ్జెట్ సిద్ధం

ఇచ్ఛాపురం: ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో ప్రధానోపాధ్యాయులతో వార్షిక వర్క్‌ప్లాన్‌పై ఎంఇఒ అప్పారావు శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. 2024-25, 2025-26 వార్షిక వర్క్‌ప్లాన్ సిద్ధం చేసుకోవాలన్నారు. పాఠశాలకు అవసరమైన వాటిని ప్లాన్‌లో పొందుపర్చాలని సూచించారు. అన్ని పాఠశాలలు స్కూల్ డెవెలప్‌మెంట్ ప్లాన్, హీబటేషన్ ప్లాన్ తయారు చేసి స్కూల్ కాంప్లెక్స్ కి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌ఎంటిలు, విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.